పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న సర్పంచ్ వెంకట్‌రెడ్డి

ఘట్‌కేసర్: గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సర్పంచ్ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాచవానిసింగారం పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులతో కలిసి గ్రామాభివృద్ధిపై చర్చించారు. గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట వీధి దీపాలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. వచ్చే హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా నీరు అందించాలని, కావాల్సిన మొక్కలు పెంచుకోవాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ జంగమ్మ, ఉప సర్పంచ్ గీత, వార్డు సభ్యులు విష్ణుగౌడ్, శ్యామ్, సుదర్శన్ ఇతర సభ్యులు పాల్గొన్నారు

సైబర్ మోసాలపై అవగాహన



సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మురళీధర్

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలోని రెడ్‌సన్ జూనియర్ కళాశాల విద్యార్థినులకు సైబర్ మోసాలపై మేడ్చల్ పోలీసులు అవగాహన కల్పించారు. ఎస్ఐ మురళీధర్ విద్యార్థినులకు సైబర్ మోసాలు, నేరాలు, లోన్, జాబ్, క్రిప్టో కరెన్సీ, న్యూడ్ కాల్స్, లోన్ యాప్స్ వంటి వాటి పేరిట నేరాలు, మోసం చేసే విధానం, వాటితో జరిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు వాహనాలు నడిపితే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో పాఠశాల విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. సీఎంఆర్‌సెట్, ఉల్లాస్ ట్రస్ట్ సంయుక్తంగా కాన్ డూ పేరిట నిర్వహించిన వర్క్‌షాప్‌లో 12 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా వారికి పోటీ ప్రపంచంలో తమ నైపుణ్యాలను ఎలా అభివృద్ధి చేసుకోవాలో వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో క్లాస్ టాపర్, అకాడమిక్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సీఎంఆర్ గ్రూప్స్ సీఈఓ అభివన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో దేవదాస్, సురేశ్‌రామ్, శ్రీకాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు



కీసర: చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి దేవాలయం వద్ద శనివారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన ఏర్పాట్లను ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, కీసర ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌ఓ జవహర్‌నగర్ డీఐ శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి చీర్యాల దేవాలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున క్యూ, తాగునీరు, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందన్నారు. స్వామివారిని సప్తద్వారాల మీదుగా ఉత్తర ద్వార దర్శనం చేసుకునే విధంగా భక్తులకు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ధర్మకర్త శ్రీహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



న్యూలిటిల్ లిల్లీ పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన

మేడ్చల్: జాతీయ గణిత దినోత్సవాన్ని వివిధ పాఠశాలల్లో శక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస రామానుజ చిత్రపటాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలు, గణిత ప్రదర్శనలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

కూల్చివేతలో రాజకీయ కోణం



కాచవానిసింగారం కూల్చివేత బాధితులతో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: అక్రమ నిర్మాణాల కూల్చివేతల్లో రాజకీయ కోణం ఉందని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. కాచవానిసింగారంలో శుక్రవారం బాధితులను పరామర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటు తమకు వేయలేదని కొందరు నాయకులు కూల్చివేయిస్తున్నారని, కబ్జాకు గురైన భూముల్లో నాయకుల హస్తం ఉందని ఆరోపించారు. నాయకుల జోలికి వెళ్లకుండా పేదల ఇళ్లను కూల్చడం ఎంత వరకు సమంజసమని అన్నారు.

పార్లమెంట్ సభ్యులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

కలెక్టరేట్ వద్ద సీపీఐ ఆందోళన



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తూ..

సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ భవనం భద్రతపై మాట్లాడని బీజేపీ ప్రభుత్వం దాడికి గల కారణాలు అడిగిన ఎంపీలను సస్పెండ్ చేయడం విడ్డూరంగా ఉందని సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేష్ విమర్శించారు. దాడికి పాల్పడిన వారికి పాస్‌లు జారీ చేసి, రచ్చకు కారణమైన బీజేపీ ఎంపీని సస్పెండ్ చేయకపోవడం దారుణమన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట సీపీఐ జిల్లా సమితి చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ భవనంలోకి చొరబడి కలర్ గ్యాస్‌ను విడుదల చేసిన ఘటన, భద్రత వ్యవస్థ లోపాన్ని ఎత్తి చూపుతుందన్నారు. 143 మంది పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడంపై సీపీఐ దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఉమామహేష్ తెలిపారు. ప్రజల హక్కుల గురించి ఆలోచించకుండా నియంతగా పాలిస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. గంటకు పైగా ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించిన సీపీఐ జిల్లా నాయకులు కలెక్టర్ గౌతమ్‌కు వినతి పత్రం అందజేశారు. తమ నిరసనను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని కలెక్టర్‌ను కోరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు శంకర్, శంకర్‌రావు, కృష్ణమూర్తి, లక్ష్మీ, హరినాథ్‌రావ్, శ్రీనివాస్, రాములు గౌడ్, స్వరూప, ప్రమీల, రాములు, శ్రీనివాస్, రమేష్, రాజేశ్వరి, పద్మ, లక్ష్మీనారాయణ, సామెల్, చంద్రకాంత్, సత్తిరెడ్డి, ఇమామ్, లక్ష్మణ్, ఇస్తారీ, రవి, యాదగిరి, బాబు పాల్గొన్నారు.

నాగారం ప్రభుత్వ స్కూల్‌లో గణిత దినోత్సవం



నమూనాలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

కీసర: గణిత పితామహుడు రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని నాగారం ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన గణిత దినోత్సవంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ తిరుపతిరెడ్డి, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ ఉపాధ్యాయులు సరిత, మాలోత్ సాహెబ్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మేడ్చల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మేడ్చల్‌కు చెందిన ఎస్ఎస్‌జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహించి విద్యార్థులకు గణితం ప్రాధాన్యతను వివరించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు నిఖిల్ సత్యగౌడ్, దేవగౌడ్, సతీష్‌గౌడ్, సాయిచరణ్‌గౌడ్, పూర్ణచంద్, అంకిత్, రఘు, భార్గవ్, సన్నీ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్‌గౌడ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరోనా కొత్త వేరియంట్‌తో అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్ఓ రఘునాథ్‌స్వామి.

సాక్షి, మేడ్చల్ జిల్లా: కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.టి.రఘునాథ్ స్వామి సూచించారు. కరోనా లక్షణాలు ఉంటే వెంటనే సమీప ప్రాథమిక / పట్టణ ఆరోగ్య కేంద్రం, బస్తీ దవాఖానాలో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కొత్త వేరియంట్‌తో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో వైద్యులు సిబ్బందిని అప్రమతం చేసినట్లు తెలిపారు. కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో మల్కాజిగిరి ఏరియా ఆస్పత్రిలో 50 పడకలు, ఘట్‌కేసర్ ఆస్పత్రిలో 10 పడకలు, మేడ్చల్‌లో 10 పడకలతో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేయడంతో పాటు పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచామన్నారు.

ఎన్నికల ఖర్చు వివరాలను అందజేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల ఖర్చు వివరాలను సత్వరమే అందజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ జీ.విజయేందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఎజెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, ఎన్నికల వ్యయ పరిశీలకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో ట్రస్మా క్రీడోత్సవాలు ప్రారంభం

ఉప్పల్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించాలని ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్‌కుమార్ సూచించారు. మేడిపల్లి మండల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఆధ్వర్యంలో ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు క్రీడలను ప్రోత్సహించడంపై ఆయన అభినందించారు. స్పోర్ట్స్‌లో కూడా విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని తెలిపారు. రెండు రోజుల పాటు క్రీడోత్సవాలు జరుగుతాయని, గెలుపొందిన విజేతలకు ట్రోఫీలను అందజేస్తామని ట్రస్మా కార్యదర్శి మధుసూదన్, జిల్లా అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి, మేడిపల్లి మండల అధ్యక్షుడు పి.రవీందర్ తెలిపారు. మండలం నుంచి దాదాపు 40 స్కూళ్ల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఖోఖో, చెస్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న జీవన్ సాగర్ ఎగ్జిబిషన్

బోడుప్పల్: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని ఉప్పల్ డిపో వద్ద ఏర్పాటు చేసిన జీవన్ సాగర్ ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతిరోజూ తిలకిస్తూ ఆనందాన్ని పొందుతున్నారు. నిత్యం బిజీగా ఉండే నగర శివారు ప్రజలు ఆటవిడుపుగా ఈ ఎగ్జిబిషన్‌కు వస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు నారాయణ వెల్లడించారు. జెయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్, సోలాంబో, డ్రాగన్ ట్రెయిన్, బోట్ రైడ్, బౌన్సర్, కొలంబస్, మెరిగో రౌండ్ ఎంతో ఆకట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. మహిళలు, యువతులతో నిత్యం జ్యూవలరీ స్టాల్స్, రెడీమేడ్ స్టాల్స్, డ్రైఫ్రూట్ స్టాల్స్, ఆల్ వెరైటీ ఫుడ్ స్టాల్స్‌ను సందర్శించి అవసరం ఉన్న వారు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా అండర్ వాటర్ ట్యూనల్ అక్వేరియాన్ని మొదటిసారిగా ఏర్పాటు చేయడం ఎంతో ఆకర్షణీయంగా ఉంది. నీటి అడుగున సొరంగ ప్రదర్శన, రెండు వేల చేపలతో ప్రత్యేక ఆకర్షణీయంగా ఉందన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 3 నుంచి రాత్రి 10గంటల వరకు నిర్వహిస్తున్న ఈ జీవన్ సాగర్ ఎగ్జిబిషన్‌ను బోడుప్పల్, పీర్జాదిగూడ, మేడిపల్లి, ఉప్పల్, ఘట్‌కేసర్, పోచారం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సుధీర్‌బాబు

అల్వాల్: మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ముఠాను ఎల్‌బీ నగర్ పోలీసులు అరెస్టు చేశారు. నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ సుధీర్ బాబు వివరాలు వెల్లడించారు. రాజమండ్రికి చెందిన వీరం నాగేశ్వర్(24) బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలసవచ్చి కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. కోదాడకు చెందిన కలతిరిపి జితేంద్ర(25) సినిమాల్లో డబ్బింగ్ సౌండ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ కలిసి బెంగళూరు నుంచి మాదక ద్రవ్యాలను తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎల్‌బీ నగర్ ఎస్‌వోటీ పోలీసులు, వనస్థలిపురం పోలీసులు కలిసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 30 గ్రాముల మాదక ద్రవ్యం ప్యాకెట్లను, 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

అల్వాల్: భరత్‌నగర్, కౌకూర్, వాంబే కాలనీలో కొంతకాలంగా నెలకొన్న విద్యుత్ సరఫరా సమస్యలతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ నేత మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు కాలనీలవాసులు శుక్రవారం కలిశారు. కాలనీల్లో సుమారు 400కు పైగా కుటుంబాలు ఉన్నాయని విద్యుత్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు ఉన్నందున వీలైనంత తక్కువ ఖర్చుతో విద్యుత్ మీటర్లను అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మైనంపల్లి హన్మంతరావు విద్యుత్ శాఖ డీఈ సుభాష్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వీలైనంత త్వరలో సమస్యను పరిష్కరిస్తానని డీఈ సుభాష్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జితేంద్రనాథ్, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, మల్లికార్జున్, రాజు యాదవ్, వంశీ, కవిత, ఫిలిప్స్ తదితరులు ఉన్నారు.

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: చెట్ల కొమ్మల నరికివేత కారణంగా శనివారం అత్వెల్లి సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ పవన్‌చందు తెలిపారు. అత్వెల్లితో పాటు గ్రామ పరిధిలోని అన్ని డొమెస్టిక్, కమర్షియల్, అగ్రికల్చర్, ఇండస్ట్రియల్ సర్వీసులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

ప్లాట్ల విషయంలో దాడి చేసిన వారికి రిమాండ్

జవహర్‌నగర్: ప్లాట్ల విషయంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ దాడికి పాల్పడిన నిందితులను రిమాండ్‌కు తరలించిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ వైఎస్ఆర్‌నగర్‌కు చెందిన అన్వర్, మనోహర్, గబ్బిలాలపేటకు చెందిన ఓంప్రకాష్‌లు జవహర్‌నగర్ కార్పొరేషన్ సర్వే-173 అయ్యప్ప సొసైటీలో ప్లాట్ల విషయంలో అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నెల 10వ తేదీన వీరు ముగ్గురు ఓ ప్లాట్ విషయంలో అకారణంగా గొడవ చేసి తల్లికొడుకులను అసభ్యంగా దూషిస్తూ, కర్రలతో గాయపర్చారు. వెంటనే బాధితులు జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మనోహర్, అన్వర్‌పై గతంలో భూవివాదాల్లో పాత కేసులు ఉన్నాయన్నారు.

విద్యార్థిని అదృశ్యం



అర్పిత విశ్వకర్మ(ఫైల్)

మేడ్చల్‌రూరల్: కళాశాలకు వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలోని ఉమానగర్ కాలనీలో నివాసం ఉండే రాజేశ్‌కుమార్-సీత దంపతుల కుమార్తె అర్పిత విశ్వకర్మ(17) మేడ్చల్ పట్టణంలోని రెడ్‌సన్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గురువారం తండ్రి రాజేశ్‌కుమార్ కళాశాల వద్ద వదిలిపెట్టి విధులకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కళాశాల వద్దకు వెళ్లి ఆరా తీశాడు. మధ్యాహ్నం ఇంటికి వెళ్లిపోయినట్లు కళాశాల సిబ్బంది తెలిపారు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టరేట్‌లో సెమీ-క్రిస్మస్ వేడుకలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: సెమీ -క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లో ఉద్యోగులు, సిబ్బందితో కలిసి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి రఘునాథస్వామి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎక్స్‌టెన్షన్ మీడియా అధికారి అంజయ్య, డిప్యూటీ పారామెడికల్ అధికారి సింహారాజు, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యం, వివిధ కేటగిరిలకు చెందిన అధికారులు, ఉద్యోగులు ఈశ్వర్, శ్రీనివాస్, గిరికాంత్, అనిల్, పద్మ, అన్నపూర్ణ, రామ్‌రెడ్డి, జేమ్స్‌దాస్, శ్రీచాంద్, అక్షయ్, విజయ్, మంజుల, శ్రీవిద్య, నాగలక్ష్మి, నాగరాజు, కమల్, విజయ్, బాలాజీ, సత్యనారాయణ, ప్రకాష్, అమరేశ్వరి, గణేష్ పాల్గొన్నారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ

కీసర: క్రిస్మస్ పండగను పురస్కరించుకొని నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు కీసర మండలంలోని వివిధ గ్రామాల్లోని పేద క్రిస్టియన్లకు ప్రభుత్వం తరపున క్రిస్మస్ కానుకల పంపిణీ కార్యక్రమంలో నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల చైర్మన్లు కౌకుట్ల చంద్రారెడ్డి, వసుపతిప్రణితాగౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, మున్సిపల్ కమిషనర్లు రాజేంద్రకుమార్, రాజమల్లయ్య, తహసీల్దార్ అశోక్‌కుమార్, కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, పంగహరిబాబు తదితరులు పాల్గొన్నారు.



'సంస్కృతి'లో సెమీ క్రిస్మస్ వేడుకలు



కొండాపూర్ సంస్కృతి విద్యాసంస్థలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని కొండాపూర్ గ్రూపు సంస్కృతి విద్యాసంస్థలో సెమీ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదికపై క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేశారు. విద్యార్థులు శాంతాక్లాజ్ వేషధారణలో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ముఖ్య అతిథి ఏఎంఐ ఫౌండర్, సీఈఓ కిశోర్ దాసరి, ప్రభాకర్‌రెడ్డి హాజరై క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఏసు లోకంలో వెలుగులు నింపారని, పండుగలు సమాజాన్ని ఏకం చేస్తాయన్నారు. కార్యక్రమంలో సంస్కృతి విద్యాసంస్థల డైరెక్టర్స్, ప్రిన్సిపల్స్, కళాశాల కార్యాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పట్టణంలోని బాలాజీనగర్ శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీఅలివేలు మంగ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. స్వామివారిని, అమ్మవారి విగ్రహ మూర్తులకు నూతన వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి కళ్యాణ మండపంపై ప్రతిష్ఠించారు. అనంతరం బ్రాహ్మణుల వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహిచారు. కల్యాణంలో మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య దంపతులు కల్యాణంలో పాల్గొని అన్నదానం చేశారు. నిర్వాహకులు శ్రీసదానంద యోగీశ్వరులు చింతపండు సంజీవయ్య, ఆలయ పురోహితులు, నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సమాజానికి దోహదపడే ఆవిష్కరణలు రూపొందించాలి

హైదరాబాద్ ఐఐఐటీ ప్రొఫెసర్ యజ్ఞనారాయణ



మాట్లాడుతున్న ముఖ్యఅతిథి యజ్ఞనారాయణ

ఘట్‌కేసర్: సమస్యలు శోధించినప్పుడే సమాజానికి దోహదపడే ఆవిష్కరణ రూపొందించవచ్చని హైదరాబాద్ ఐఐఐటీ ప్రొఫెసర్ యజ్ఞనారాయణ అన్నారు. శుక్రవారం అనురాగ్ యూనివర్సిటీలో సీఎస్ఈ విభాగం, స్ప్రింజర్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అడ్వాన్సెస్ ఇన్ కంప్యూటేషన్ ఇంటలీజెన్స్ అండ్ ఇన్ఫర్మాటిక్స్-2023 (ఐసీఏసీఐఐ-2023)కు గౌరవ అతిథి ప్రొఫెసర్లు విష్ణు ఎస్.పెండ్యాల, ప్రత్యూష నూతలపాటితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన పరిశోధన విషయాలు తెలుసుకోవడానికి కాన్ఫరెన్స్‌లు ఉపయోగపడతాయని, అధునాతన టూల్స్ వినియోగించి మెరుగైన అప్లికేషన్లు సృష్టించాలని సూచించారు. సాంకేతికతలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పరిశోధనలు జరపాలని యూనివర్సిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సీఈఓ నీలిమా, చాన్సలర్ యూబీ దేశాయ్, వైస్ చాన్సలర్ రామచంద్రం, ప్రొఫెసర్లు విష్ణుమూర్తి, ఫాతిమా, బాలాజీ, విజయ్‌కుమార్, బాలకృష్ణ, డీన్‌లు, హెచ్‌ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యం రైతులకు కృతజ్ఞతలు తెలపాలి



రైతు దినోత్సవంలో అధ్యాపకులు, విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: రైతు దినోత్సవం రోజు రైతులకు కృతజ్ఞతలు తెలిపి సరిపెట్టకుండా మనం నిత్యం అన్నం తినే ముందు వారిని తలచుకుని కృతజ్ఞతలు తెలపాలని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి కళాశాలలో శుక్రవారం జాతీయ రైతు దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జైకిసాన్ పేరిట విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం సాంకేతిక పురోగతి సాధించడంలో, సవాళ్లను అధిగమించడంలో రైతుల ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. అస్థిర వాతావరణ నమూనాలు, మారుతున్న మార్కెట్ పరిస్థితులు, సాంకేతిక పరిజ్ఞానం, అభివృద్ధి వంటి ఇబ్బందులను ఎదుర్కొనే రైతుల అంకితభావం, వారి సంకల్పానికి ధన్యవాదాలు తెలిపేందుకు రైతు దినోత్సవం జరుపుకోవడం ఎంతో ముఖ్యమంటూ రైతులను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లోకనాథం, కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తడి, పొడి, హానికర చెత్తను వేరుచేయాలి



క్లాత్ బ్యాగులు ఆవిష్కరిస్తున్న కౌన్సిలర్ వెంకటరెడ్డి, మహిళలు

కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి

ఘట్‌కేసర్: తడి పొడి చెత్తతో పాటు హానికరమైన చెత్తను వేరు చేయాలని ఒకటో వార్డు కౌన్సిలర్ చందుపట్ల వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీ నగర్ బీ1, బీ2 కాలనీలో మేక్ ఇండియా స్వచ్ఛ గ్రీన్ జైన్‌లో భాగంగా 'నా చెత్త.. నా బాధ్యత' క్లాత్ బ్యాగులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హానికరమైన వస్తువులు గాజు, సీసం, ఇనుము, స్టీలు, తుప్పు పట్టిన వస్తువులను వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం వావ్ ఐటీసీ వారి ఆధ్వర్యంలో క్లాత్ బ్యాగులను ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమణ, అశ్విని, కన్యాకుమారి, వావ్ ఐటీసీ సభ్యులు రామకృష్ణ, అనురాధ, వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387